క్లుప్తంగా

జేసీబీ, రెండు ట్రాక్టర్లు సీజ్



కమలాపూర్ : మండలంలోని అంబాలగుట్ట నుంచి అక్రమంగా మొరంమట్టిని తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లను సోమవారం రాత్రి సీజ్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవ్ మంగళవారం వెల్లడించారు. మొరం తరలించడం వలన రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వ్యవసాయ భూములకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీంతో పంటపొలాలు దెబ్బతింటున్నాయని ఇటీవల రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి అక్రమంగా మొరంమట్టిని తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరంమట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చించారు.

మర్యాదగా ప్రవర్తించాలి

దామెర: స్టేషన్‌కు వచ్చే బాధితులతో పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలని పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే దరఖాస్తులను పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానం అమలుచేస్తూ బాధితులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. వర్టికల్ విధానం పాటిస్తూ, కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎస్సై ముత్యం రాజేందర్, ఏఎస్సైలు సిద్దయ్య, రాజు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీఐకి సన్మానం



ఆత్మకూరు: సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రవిరాజును ఎంపీటీసీల ఫోరమ్ మండల అధ్యక్షుడు అర్షం వరుణ్‌గాంధీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పాపని రవీందర్, సీనియర్ నాయకులు కానుగంటి సంపత్‌కుమార్, లక్కర్సు లింగమూర్తి తదితరులు సీఐని శాలువాతో ఘనంగా సన్మానించారు.

తాగి వాహనాలు నడపొద్దు



శాయంపేట : మండలంలోని మాందారిపేట వద్ద స్థానిక ఎస్సై దేవేందర్ వాహనాలను తనిఖీ చేశారు. డ్రంక్‌అండ్‌డ్రైవ్ టెస్టు నిర్వహించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని తెలిపారు. ప్రతీ ఒక్క వాహనాదారుడు సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

ఆటో డ్రైవర్ల దినోత్సవం



ఎల్కతుర్తి: ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవ వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సుమారు 80 ఆటోలతో మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఆటో యూనియన్ డ్రైవర్ల డిమాండ్లను సత్వరమే పరిష్కారించాలని కోరారు. మండల అధ్యక్షుడు లోకిని తిరుపతి, ఉపాధ్యక్షుడు జంగం సురేష్, ప్రధాన కార్యదర్శి జంగం రాజు, సీనియర్ డ్రైవర్లు వెంకటేష్‌యాదవ్, కోరె భిక్షపతి, అంబాల చేరాలు, హింగె రమేష్, అంబాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఓ దురుసు ప్రవర్తన



శాయంపేట : స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర బృందం సభ్యులు మండల కేంద్రంలో మంగళవారం పర్యటిస్తుండగా న్యూస్ కవరేజీకి వెళ్లిన నలుగురు జర్నలిస్టులతో ఎంపీఓ రంజిత్‌కుమార్ దురుసుగా ప్రవర్తించారు. దీంతో మండల జర్నలిస్టులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. క్షమాపన చెప్పాలని, ఎంపీఓను సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. స్పందించిన ఎంపీడీఓ అతని క్షమాపన చెప్పించడంతో గొడువ సద్దుమనిగింది.

మొక్కలు నాటాలి

ఆత్మకూరు: గ్రామంలోని ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పంచాయతీ కార్యదర్శి మేడ యాదగిరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

- మొక్కల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి
- వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్



పరకాల : మొక్క నాటుతున్న డీసీపీ పులిగిల్ల రవీందర్

పరకాల: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పులిగిల్ల రవీందర్ అన్నారు. వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన మొదటిసారి ఆయన పరకాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ వెంకటరత్నంతో కలిసి మొక్కలు నాటారు. నేర రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రతీ ఇంటి ఆవరణంలోని ఖాళీ స్థలంలో మొక్కలు నాటి సంరక్షించే బాధ్యత ప్రతీఒక్కరూ తీసుకోవాలని అన్నారు. మొక్కలతోనే మానవులకు జీవనాధారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శివకృష్ణ, ప్రశాంత్‌బాబు, ఏఎస్సై వీరస్వామి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి: మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తేనే పర్యవరణాన్ని పరిక్షించుకోవచ్చని ట్రైయినీ ఐపీఎస్ అంకిత్ శంక్వార్ అన్నారు. మండల కేంద్రంలోని ఆల్ఫోర్స్ పాఠశాల ఆవరణలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటడం వలన అవి వృక్షాలుగా ఎదిగి మానవ మనుగడకు దోహదపడుతాయన్నారు. అలాగే విద్యార్థులు సైతం తమ ఇళ్లలో మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పొలం గట్లు, ఇంటి ఆవరణంలోని ఖాళీ స్థలాల్లో రైతులు, మొక్కలు నాటాలని కోరారు. అంతే కాకుండా విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గోదారి రాజ్‌కుమార్, పుస్కునూరి కార్తిక్‌రావు, రవికుమార్, సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.



ఎల్కతుర్తి : మొక్కనాటుతున్న అంకిత్ శంక్వార్

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



మాట్లాడుతున్న డాక్టర్ అనిత



నడికూడ : అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

శాయంపేట : తల్లిపాలే పుట్టిన బిడ్డకు శ్రీరామరక్ష అని డాక్టర్ అనిత అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. తల్లిపాల వారోత్సవాలు ఈ నెల 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే పాపకు తల్లిపాలు పట్టిస్తే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోష్న, కవిత, రత్నామాల, స్వేత, పుష్ప, అరుణ, రమ, గర్భిణులు, బాలింతలు, కిషోరబాలికలు పాల్గొన్నారు.

నడకూడ: మండల కేంద్రంలోని 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. బాలింతలకు, గర్భిణులకు, తల్లులకు సీడీపీఓ భాగ్యలక్ష్మి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, వాటితో బిడ్డకు రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. పిల్లలకు తల్లిపాలు పట్టించడం వలన తల్లికి అధిక రక్తపోటు, దీర్ఘకాల జబ్బుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనిత, సంపూర్ణ, వినోద, కళావతి ఆయాలు నర్సమ్మ, సుజాత, మేరి సెంటర్స్, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం



పరకాల : సభ్యత్వ నమోదులో నాయకులు



ధర్మసాగర్ : సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

పరకాల: ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పీఆర్టీయూ(టీఎస్) పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి అన్నారు. మండలంలోని పోచారం, వెల్లంపల్లి, కామారెడ్డిపల్లితో పాటు పట్టణంలోని రాజిపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరికొద్ది రోజుల్లోనే పీఆర్సీ కమిటీని నియమించి ఉపాధ్యాయులకు ఐఆర్ ఇప్పించే విధంగా పీఆర్టీయూ రాష్ట్ర శాఖ కృషి చేస్తుందన్నారు. మండల అధ్యక్షుడు రాజేందర్‌బాబు, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు మంత్రి శ్రీనివాస్, తిరుపతిరావు, శ్రీనివాస్, శశికశాధర్, కార్యదర్శి కోటయ్య, మహిళ ఉపాధ్యక్షురాలు మణెమ్మ, నడికూడ మండల అధ్యక్షుడు శ్రీధర్, ప్రధానకార్యదర్శి సుదర్శన్ పాల్గొన్నారు.

ధర్మసాగర్: మండలంలోని ఉనికిచర్ల జెడ్పీహెచ్ఎస్, పీఎస్, రాపాకపల్లి పీఎస్, ధర్మసాగర్ జెడ్పీహెచ్ఎస్ బాలుర, దేవునూర్, ముప్పారం పీఎస్ పాఠశాలల్లో పీఆర్టీయూ (టీఎస్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సంఘం మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఉపాధ్యాయుల సమస్యలు, హక్కులను సాధించేది పీఆర్టీయూ సంఘం మాత్రమేనని అన్నారు. ప్రధానకార్యదర్శి జాన్‌సింగ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి, రామచంద్రారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శులు నరేష్‌కుమార్, దయాకర్, ప్రభాకర్‌రెడ్డి, సరస్వతి పాల్గొన్నారు.

దామెర: పీఆర్టీయూతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పలిత శ్రీహరి అన్నారు. దామెర, ల్యాదెళ్ల, ఊరుగొండ, పులుకుర్తి ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఉపాధ్యాయుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మండల అధ్యక్షుడు చల్లా రాజిరెడ్డి, ప్రధానకార్యదర్శి బొమ్మకంటి శరత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సింగరావు, సుధాకర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి, సోమన్న, రాంశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంబురాలు



పరకాల: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో పరకాల ఆర్టీసీ డిపోలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులు మంగళవారం సంబురాలు జరుపుకున్నారు. బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్మికులకు ఇచ్చిన మాట ప్రకారం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నక్క చిరంజీవి, పీఏసీఎస్ డైరెక్టర్ పంచగిరి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు దుంపేటి నాగరాజు, బొచ్చు భాస్కర్, కార్మిక సంఘం నాయకులు శ్రీనివాస్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నేడు (బుధవారం) ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఉద్యోగ విరమణ సహజం



కమలాపూర్ : మండలం కేంద్రానికి చెందిన పులికంటి సమ్మయ్య 42 ఏళ్లుగా పోస్టల్ శాఖకు అందిస్తున్న సేవలు మరువలేనివని అఖిల భారత తపాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, హుజురాబాద్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఊకంటి మహేందర్‌రెడ్డి అన్నారు. కమలాపూర్ పోస్ట్ ఆఫీస్‌లో ఎంటీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమ్మయ్య ఉద్యోగ విరమణ ఆత్మీయ వేడ్కోలు సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సమ్మయ్య దంపతులకు శాలువా, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. క్రమశిక్షణతో నిత్యం విధుల కోసం పరితపించే వ్యక్తి సమ్మయ్య అని, ఆయన సేవలు పోస్టల్ శాఖలోని ప్రతీ ఉద్యోగికి ఆదర్శనీయమన్నారు. జమ్మికుంట ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ నరేష్, కమలాపూర్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఆడెపు చంద్రమోహన్, రవికుమార్, రజనీకాంత్, రాజు, రఘురాం, విద్యాసాగర్, శ్రీనివాసచార్యులు, తొటం తిరుపతి, కృష్ణారావు, అనిల్, కిరణ్, రవళి, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానశాస్త్రంతోనే దేశ భవిష్యత్



విద్యార్థులతో అశోక్ కుమార్, ఉపాధ్యాయులు

ఐనవోలు: విజ్ఞానశాస్త్రంతోనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉంటుందని ప్రాంతీయ సైన్స్ సెంటర్ ఫీల్డ్ కోఆర్డినేటర్ అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించగా ఆయన మాట్లాడారు. పిల్లల్లో శాస్త్ర విజ్ఞానం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి వారిలో పరిశోధన ఆసక్తిని, అభిరుచిని కలిగించేందుకు ప్రాంతీయ సైన్స్ సెంటర్ కృషి చేస్తుందన్నారు. వ్యాస రచనలో మేటి చైతన్య, కీర్తన, బ్లెస్సీ, డ్రాయింగ్ పేయింటింగ్ విభాగంలో నిస్సి, భానుశ్రీ, కీర్తన, క్విజ్‌లో లోకేశ్వర్‌రెడ్డి, అక్షయ, వైష్ణవిలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారని తెలిపారు. పోటీల్లో నిలిచిన విజేతలను ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు సాంబయ్య, రామనాథం, రాజేందర్, ప్రసాద్, శైలజ, మాధురి, సత్యనారాయణరెడ్డి, సెలీనా, లక్ష్మినారాయణ, ప్రాంతీయ సైన్స్ సెంటర్ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదలకు న్యాయం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఎల్కతుర్తి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. భీమదేవరపల్లి మండలం ముస్తాఫపూర్‌లో మంగళవారం పల్లెపల్లెకు ప్రవీణన్న, గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామ కూడలి వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి మెనిఫెస్టో కరపత్రాలు ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతుందన్నారు. నియోజకవర్గ ప్రజల బాధలు స్థానికేతరుడైన ఎమ్మెల్యే సతీష్‌బాబుకు తెలియవని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. పంట పొలాలకు సాగు నీరందిస్తామన్నారు. పార్టీ నాయకులు కుమారస్వామి, అయిలయ్య, కనుకయ్య, లక్ష్మారెడ్డి, స్వరూప, పాల్గొన్నారు.

పల్లెల్లో కేంద్ర బృందం పర్యటన



ఒగ్లాపూర్‌లో పర్యటిస్తున్న కేంద్ర బృందం

దామెర: మండలంలోని ఒగ్లాపూర్‌లో చేపట్టిన పల్లె ప్రగతి పనులను కేంద్ర బృందం సభ్యులు మంగళవారం పరిశీలించారు. తనిఖీలో భాగంగా గ్రామంలోని పలు నివాస గృహాలను, వైకుంఠధామం, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఇంకుడుగుంతలు, కిచెన్‌షెడ్లు, డంపింగ్‌యార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ, ఇళ్ల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను పరిశీలించారు. డీఆర్డీఓ శ్రీనివాసకుమార్, ఎంపీడీఓ రవీందర్, ఎంపీఓ నాగరాజు, ఏపీఓ శారద, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, టీఏ ప్రిసిల్లా, కార్యదర్శులు నరేష్, మనోహర్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు: మండలంలోని అగ్రంపహాడ్ గ్రామంలో స్వచ్ఛసర్వేక్షన్ కేంద్ర బృందం సభ్యులు మంగళవారం పర్యటించారు. టీమ్ లీడర్ ప్రవళిక ఆధ్వర్యంలో బృందం సభ్యులు గ్రామంలో పర్యటించి మరుగుదొడ్ల సౌకర్యాలు, ఇంకుడు గుంతలు, పిల్లలు చేతులు శుభ్రపర్చుకునే విధానం, చెత్త సేకరణ వివరాలను అడిగితెలుసుకున్నారు. జీపీలో తొమ్మిది రకాల రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే తొమ్మిది రకాల వాల్‌పెయింటింగ్‌లను పరిశీలించారు. కేంద్ర బృందం గ్రామస్తులకు స్వచ్ఛత గురించి పలు సూచనలు చేశారు. డీఆర్‌డీఓ శ్రీనివాసకుమార్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ చేతన్‌కుమార్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, సర్పంచ్ మాదాసి అన్నపూర్ణరాజు, ఈసీలు శ్రీధర్‌రెడ్డి, రాము, కార్యదర్శి బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి



కొట్టుకుపోయిన పొలంలో రైతులు

ఆత్మకూరు: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండల కేంద్రం శివారుతో పాటు వివిధ గ్రామాల శివారులోని పత్తి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. పంటలు నీట మునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన పంటలను గుర్తించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సర్వేలు చేపట్టడం లేదని, ప్రభుత్వం స్పందించి సర్వేలు చేయించి పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. ఖరీఫ్ ప్రారంభ దశలోనే రైతులకు ఎదురుదెబ్బ తగిలిందని, విత్తిన విత్తనాలు సైతం కొట్టుకుపోయాయన్నారు. మళ్లీ విత్తనాల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. మండలంలోని అక్కంపేటకు చెందిన రైతు రేగుల పోచందర్ రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట వేయగా పూర్తిగా నష్టపోయానని రూ.60 వేల పెట్టుబడి నీళ్లపాలు అయ్యిందని వాపోయారు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



హన్మకొండ అర్బన్ : బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న ఎస్ఆర్ఆర్ ప్రతినిధులు

హన్మకొండ అర్బన్ : నగరంలోని భట్టుపల్లి ఇందిరమ్మకాలనీ, నాగేంద్రకాలనీ ప్రాంతంలోని వరద బాధితులకు ఎస్ఆర్ఆర్ ఫార్చ్యూన్ ఇన్‌ఫ్రా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ కటూరి రమేష్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు చాలా మంది ప్రజలు సర్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, రాబోయే రోజుల్లో కూడా సంస్థ తరపున వారికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు డి.కృష్ణ నాయక్, కె.పురుషోత్తంరెడ్డి, మధుకర్‌రెడ్డి,రవిచంద్ర, కిషోర్, రాంరెడ్డి, గోవింద్, జగన్, పాల్గొన్నారు.

ఖిలా వరంగల్: వరంగల్ 33వ డివిజన్ పెరికవాడలోని ముంపు బాధితులను మంగళవారం ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాధితులకు వారం సరిపడా నిత్యావసర సరుకుల బ్యాగును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడొద్దని, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. వరద ముంపుకు గురైన వారిని ఆదుకునేందుకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎల్లప్పుడు ముందుటుందన్నారు. బాధితులు అధైర్య పడొద్దని, అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ, సుధాకర్ మోడెం ప్రవీణ్, వినయ్, వడ్డె కోటేశ్వర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

‘ఆధ్యాత్మికం’పై ప్రచారం



కమలాపూర్ : ప్రతీ హిందువు త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందు జ్ఞాన వేదిక హుజురాబాద్ కమిటీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని శనిగరంలో హిందూ ధర్మ ప్రచారం చేపట్టామన్నారు. గ్రంథాలు చదవడం ద్వారా హిందూ ధర్మంతో పాటు సమాజంలో జరిగే అంశాలపై అవగాహన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాంబాబు, శ్రీదేవి, వంశీ, తిరుపతి, కుమార్, సతీష్, గోపి, రామస్వామి, అద్వితీయ తదితరులు పాల్గొన్నారు. ప్రతిఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీత చదవాలని కోరారు.

‘తొలిమెట్టు’కు హాజరు కావాలి



మాట్లాడుతున్న రమేష్

ఐనవోలు: నేటి (బుధవారం) నుంచి తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎస్) శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎఫ్ఎల్ఎస్ మండల నోడల్ ఆఫీసర్ తాళ్లపెల్లి రమేష్ తెలిపారు. మండల కేంద్రంలో తొలిమెట్టు శిక్షణ ప్లానింగ్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధ, గురువారం తెలుగు బోధించే ఉపాధ్యాయులకు, ఈనెల 7, 8 తేదీల్లో గణితం, 9, 10 వ తేదీల్లో ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందన్నారు. రెండు రోజుల పాటు జరిగే శిక్షణకు ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. అదే విధంగా శిక్షణకు సంబంధించి రిసోర్స్‌పర్సన్‌లకు పలు సలహాలు సూచనలు చేశారు. రిసోర్స్ పర్సన్‌లు చుంచుకాల లింగారావు, బాలోజు బ్రహ్మాచారి, అశోక్‌వర్ధన్‌రెడ్డి, వేణుగోపాలస్వామి, సీహెచ్ శ్రీనివాస్, బి స్వప్న, సీఆర్పీ రేవతి తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరించిన ఉపసర్పంచ్

ధర్మసాగర్(వేలేరు): గ్రామ పంచాయితీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో గ్రామంలో పేరుకుపోయిన చెత్తను ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్ స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసిందని, తానే స్వయంగా చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నానని తెలిపారు.



ట్రాక్టర్‌తో చెత్త సేకరిస్తున్న ఉప సర్పంచ్

ఘనంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



హన్మకొండ కల్చరల్ : వ్రతంలో పాల్గొన్న దంపతులు

హన్మకొండ కల్చరల్ : తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం అధికమాస శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని హనుమకొండ రెడ్డి కాలనీలోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. 60 మంది దంపతులు వ్రతంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బత్తిని వెంకటయ్య, వెంకటరమణ, విజయలక్ష్మి, ప్రముఖ సంస్కృత పండితులు శఠగోపాచార్య పాల్గొన్నారు. టీటీడీ డీపీపీ జిల్లా ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కృష్ణమూర్తి పర్యవేక్షించారు.

కాశిబుగ్గ : స్థానిక రంగనాథస్వామి ఆలయంలో మంగళవారం అధిక శ్రావణ బహుళ పౌర్ణమిని పురస్కరించుకుని సాముహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.

స్పెక్ట్రా గ్లోబల్ విద్యార్థుల ప్రతిభ



హన్మకొండ : వీకే స్పెల్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని స్పెక్ట్రా గ్లోబల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. తమ పాఠశాలకు చెందిన కె.చర్వి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి రూ.15 వేల నగదు బహుమతి గెలుచుకున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎల్.ప్రశాంతిరెడ్డి తెలిపారు. బి.వరుణ్‌దత్త రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు, పి.హర్షిణి, ఆర్.ఆరాధ్య తృతీయ బహుమతి, ఎం.యశస్వి ఐదో ర్యాంకు, బి.హద్వి తారెడ్డి ఏడో ర్యాంకు, బి.హస్మిక 8వ ర్యాంకు సాధించారని ఆమె వివరించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎల్.ప్రశాంతిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.